సాక్షి
జగిత్యాల
ఆదివారం । 11 । జూన్ । 2023



నృసింహునికి మొక్కులు

ధర్మపురి : శ్రీలక్ష్మీనృసింహస్వామిని శనివారం వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు.



శ్రీలలితా సహస్ర పారాయణం

జగిత్యాలటౌన్: గోవింద్‌పల్లి దుర్గామాత ఆలయంలో అఖండ శ్రీలలితా సహస్రనామ పారాయణం శనివారం ప్రారంభమైంది.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.0/28.0

ఆకాశం ఉదయం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగలు ఉక్కపోతగా ఉంటుంది. ఎండ తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

'రాజ్యాంగానికి మనువాదుల ముప్పు'



మాట్లాడుతున్న గాదె ఇన్నయ్య

జగిత్యాలటౌన్/జగిత్యాలరూరల్: భారత రాజ్యాంగానికి మనువాదులతో ముప్పు పొంచి ఉందని భారత్ బచావో జాతీయ కౌన్సిల్ సభ్యుడు గాదె ఇన్నయ్య ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక రాయల్‌ఫంక్షన్‌హాల్‌లో ప్రజా సంఘాల జేఏసీ కార్యనిర్వాహక కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు, భారత్‌బచావో కౌన్సిల్ సభ్యుడు పేట భాస్కర్ అధ్యక్షతన శనివారం జరిగిన అవగాహన సదస్సులో ఇన్నయ్య మాట్లాడారు. దేశంలో మనువాదం, మతోన్మాదం, ఫాసిజం పెరిగిపోతోందన్నారు. ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అధ్యక్షతన రూపొందిన రాజ్యాంగాన్ని మనువాదుల నుంచి రక్షించుకోవాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీని బొంద పెడితేనే దేశ పౌరులకు రక్షణ ఉంటుందని అన్నారు. బీజేపీ పాలనలో అంబేద్కర్ వాదులపై దాడులు పెరిగాయని జర్నలిస్టు శుభ వినయ్ అన్నా రు. భారత్ బచావో ప్రతినిధులు జైసింగ్‌రాథోడ్, మనోహర్, మార్వాడి సుదర్శన్, పిట్టల నారాయణ, చుక్క గంగారెడ్డి, చింత భూమేశ్వర్, చెన్న విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

'కేసీఆర్‌వి స్వార్థ ప్రయోజనాలు'



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

వెల్గటూర్(ధర్మపురి): సీఎం కేసీఆర్ తన స్వప్రయోజనాల కోసం రూ.1.20లక్షల కోట్ల ప్రజాధనం దుర్వినియోగం చేసి రీడిజైన్ పేరిట మేడిగడ్డ వద్ద కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు లక్ష్మణ్ కుమార్‌తో కలిసి మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని డొల్ల తనాన్ని కప్పిపుచ్చుకోవడానికి తెలంగాణ రాష్ట్ర నీటి ప్రయోజనాలను శాశ్వతంగా బలిపెట్టబోతున్నారని ధ్వజమెత్తారు. సర్పంచ్ మేరుగు మురళీగౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూదరి రమేశ్, ఉప సర్పంచ్ సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనలో..

పెగడపల్లి(ధర్మపురి): లింగాపూర్‌లో చేపట్టిన పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన రెండోరోజు ఉత్సవాల్లో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్ పాల్గొని పూజలు చేశారు.

రేపు 'తెలంగాణ రన్'

జగిత్యాలక్రైం: దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఈనెల 12న తెలంగాణ రన్ నిర్వహిస్తామని ఎస్పీ భాస్కర్ శనివారం తెలిపారు. సోమవారం ఉదయం 6 గంటలకు ధర్మపురి శ్రీలక్ష్మీ నృసింహస్వామి ఆలయం నందీ చౌరస్తా వద్ద ప్రారంభమయ్యే రన్.. అంబేద్కర్, వివేకానంద విగ్రహాల నుంచి టెంపుల్ నందీ చౌరస్తా వరకు కొనసాగుతుందన్నారు. అలాగే జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్ మినీస్టేడియం నుంచి మున్సిపల్ పార్క్ వరకు 2కే రన్‌ను నిర్వహిస్తామన్నారు. కోరుట్లలో జగిత్యాల రోడ్డు శ్రీకృష్ణ మందిరం చౌరస్తా నుంచి వేములవాడ రోడ్డు వరకు 2కే రన్ నిర్వహించనున్నామని పేర్కొన్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే 2కే రన్‌లో పాఠశాల, కళాశాల విద్యార్థులు, క్రీడాకారులు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని ఎస్పీ కోరారు.

ఎస్సారెస్పీ కాలువపై కల్వర్టు నిర్మాణం



పనులు పరిశీలిస్తున్న అధికారులు

జగిత్యాలరూరల్: అధికారులు తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో నిమగ్నమై ఉన్నారు. ఇదే అదునుగా ఓ వ్యాపారి ఎస్సారెస్పీ కాలువపై కల్వర్టు నిర్మిస్తున్నాడు. జగిత్యాల అర్బన్ మండలం తిప్పన్నపేట శివారులో ఎస్సారెస్పీ కాలువపై గతంలోనే పనులు చేపట్టగా అధికారులు నిలిపివేశారు. అయితే, వారి కళ్లుగప్పిన వ్యాపారి మళ్లీ పనులు ప్రారంభించాడు. సమాచారం అందుకున్న చిన్ననీటిపారుదల శాఖ ఈఈ అఫ్జల్‌ఖాన్, డీఈ రాజన్న, ఏఈ వెంకటరమణ శనివారం ఆ నిర్మాణాన్ని నిలిపివేయించారు. అధికారులు అక్కడకు చేరుకోగానే పనులు చేస్తున్న కూలీలు పారిపోయారు. ఈ విషయంపై ఏఈ వెంకటరమణను వివరణ కోరగా, నిర్మాణం ఆపివేయాలని ఆదేశించినా బేఖాతరు చేశాడని, ఇందుకు కారణమైన వ్యాపారిపై పోలీసు కేసు నమోదు చేస్తామన్నారు.

సండే స్పెషల్





కుడి ఎడమైతే.. ప్రమాదమేనోయ్!

- ఇండియాలో కుడి, విదేశాల్లో ఎడమ డ్రైవింగ్
- పెరుగుతున్న అంతర్జాతీయ లైసెన్స్‌లు
- ఐటీ, విదేశీ విద్యతో అధికమవుతున్న డిమాండ్

- వాహనదారులకు, పౌరులకు రోడ్డు భద్రతపై ప్రచారం, అవగాహన కల్పించే ఓ రవాణాశాఖ అధికారి విదేశాలకు వెళ్లినప్పుడు డ్రైవింగ్ చేశాడు. యూటర్న్ తీసుకుని అలవాటు ప్రకారం వాహనాన్ని ఎడమకు తిప్పారు. అది 150 కిలోమీటర్ల స్పీడ్ ఉన్న రోడ్డు అదృష్టం కొద్దీ ఎదురుగా ఏ వాహనం రాలేదు.
- ఇటీవల విదేశాల నుంచి ఇండియాకు వచ్చిన ఓ వాహనదారుడు విదేశాల అలవాటు ప్రకారం కరీంనగర్ రోడ్డుపై కుడివైపు నుంచి కారును నడిపి భారీ ప్రమాదానికి కారణమయ్యాడు.

కొత్తలో గందరగోళం

కొత్తలో డ్రైవింగ్ చేసేటప్పుడు సహజంగా కొంత భయం ఉన్నప్పటికీ సరిగానే నడపగలిగా. ఒకసారి నా కారు ఇంకో కారును తాకినప్పటికీ పెద్దగా నష్టం జరగలేదు. ఇండియాలో వాహనానికి కుడి పక్కన స్టీరింగ్ ఉంటే అమెరికాలో ఎడమ పక్కన స్టీరింగ్ ఉంటుంది. కొత్తగా అమెరికా వచ్చిన వారికి కొంత కన్ఫ్యూజన్ ఉంటుంది. ఇక్కడి నిబంధనల ప్రకారం ముందుగా ఆన్‌లైన్ టెస్ట్ అయ్యాక డ్రైవింగ్ టెస్ట్ కోసం రోడ్డుపై వాహనం నడపాల్సి ఉంటుంది. సరిగా నడుపుతున్నారా పరిశీలిస్తారు. సరిగ్గా చేస్తేనే లైసెన్స్ జారీ చేస్తారు.

– నంగునూరి సాయి రతన్, సాఫ్ట్‌వేర్ డెవలపర్, సిటీ బ్యాంక్, డల్లాస్

అమెరికాకు వెళ్లే ముందు..



మాది కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మక్తపల్లి. 2011లో ఉద్యోగరీత్యా అమెరికా వచ్చా. అమెరికాకు వచ్చే ముందు తిమ్మాపూర్‌లోని రవాణా కార్యాలయంలో ఇంటర్నేషనల్ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకున్న. ఐదేళ్ల వ్యాలిడిటీ ఇచ్చారు. తర్వాత అమెరికాలో డ్రైవింగ్ లైసెన్స్ పొందా. మూడేళ్లకోసారి వీసాకాలం ముగిసేసరికి రెన్యూవల్ చేయించుకుంటున్న. ఇండియాలో కుడివైపు డ్రైవింగ్ స్టీరింగ్ ఉంటే అమెరికాలో ఎడమ వైపు ఉంటుంది. అందుకే ఇక్కడ లైసెన్స్‌కు ప్రాధాన్యత ఉంది.

– చింతం నరేందర్, అమెరికా

సాక్షిప్రతినిధి, కరీంనగర్: కుడి, ఎడమైతే పొరపాటు లేదోయ్..ఓడిపోలేదోయ్ అన్నాడో సినీ కవి. కానీ...అంతర్జాతీయ డ్రైవింగ్ విషయంలో అలాకాదు.. కుడి ఎడమైనా.. ఎడమ కుడి అయినా.. ప్రమాదాలు జరుగుతాయ్..ప్రాణాలు పోతాయ్.. అంటున్నారు రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (ఆర్టీఏ) అధికారులు. తాజాగా ఒడిశాలోని రైలు ప్రమాదం కూడా ఇదేవిధంగా ఒక ట్రాక్‌లో వెళ్లాల్సిన రైలు మరో ట్రాకుపై వెళ్లడంతోనే జరిగిందని ప్రచారం జరుగుతున్న వేళ.. ఒక దిశలో వెళ్లాల్సిన వాహనం మరో దిశలో పొరపాటునో, గ్రహపాటునో వెళ్తే ఎంతటి భారీ ప్రమాదం జరుగుతుంది? ఎన్ని ప్రాణాలు గాలిలో కలుస్తాయో చెప్పకనే చెప్పింది. కొన్నేళ్లుగా ఉద్యోగాల కోసం హైదరాబాద్, పలు జిల్లాల నుంచి ఐటీ నిపుణులు, ఉన్నత విద్య కోసం విద్యార్థులు విదేశాల బాట పడుతున్నారు. అగ్రరాజ్యాలు కాబట్టి అక్కడ వ్యక్తిగత వాహనాల వినియోగం అధికం. అక్కడ డ్రైవింగ్ చేసేందుకు వీలుగా మనవాళ్లు ఇక్కడే అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవాలి. కాబట్టి, విదేశాలకు వెళ్లే వారంతా అక్కడ డ్రైవింగ్ చేసేందుకు వీలుగా అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్సులు తీసుకుంటున్నారు. కొన్నేళ్లుగా వీటికి డిమాండ్ పెరిగింది. ఈనేపథ్యంలో రోడ్డు నిబంధనలు కూడా ముఖ్యమే అన్న సంగతి చాలామంది మరిచిపోతున్నారు. దీంతో విదేశాల్లో డ్రైవింగ్ చేసే సమయంలో చిన్న పొరపాటు చేసినా దిద్దుకోలేని తప్పుగా మారే ప్రమాదముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ముందు సాధన చేయాలి



విదేశాలకు వెళ్లిన ప్రతీ భారతీయుడికి మొదట్లో ఎదురయ్యే సమస్యే ఇది. చూసేందుకు చిన్నదిగా కనిపించినా క్షణాల్లో భారీ ప్రాణనష్టం జరిగే ప్రమాదం అధికం. ముందుగా అక్కడి రోడ్డు నిబంధనలు అలవాటు అయ్యే వరకు అక్కడ వాహనాలపై సాధన చేయాలి. అక్కడి రోడ్డు నిబంధనలపై పట్టు వచ్చాకే డ్రైవింగ్ చేయాలి.

– పుప్పాల శ్రీనివాసరావు, డిప్యూటీ కమిషనర్, ఆర్టీఏ

జత చేయాల్సిన పత్రాలు

ఫోర్ వీలర్ డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్టు, వెళ్లాలనుకునే దేశం జారీచేసిన వీసా(తప్పనిసరి కాదు), రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఫారం–1ఎ పత్రాలు, రూ.1700 ఆన్‌లైన్‌లో చెల్లించిన రసీదు

ఏడాది వ్యవధిలో జారీ అయిన లైసెన్స్‌లు

2022 మేలో 34, జూన్‌లో 70, జూలైలో 142, ఆగస్టులో 167, సెప్టెంబర్‌లో 92, అక్టోబర్‌లో 42, నవంబర్‌లో 44, డిసెంబర్‌లో 160, ఈ ఏడాది జనవరిలో 84, ఫిబ్రవరిలో 48, మార్చిలో 32, ఏప్రిల్‌లో 59, మేలో 77 లైసెన్స్‌లు జారీ అయ్యాయి.

ఏంటి సమస్య?



సాధారణంగా ఇండియా రోడ్డు నిబంధనల ప్రకారం రోడ్డుకు ఎడమ వైపు వాహనాలు ప్రయాణిస్తాయి. అందుకే మనం 'ఆల్వేస్ కీప్ లెఫ్ట్'' అన్న సూచికలు పెడుతుంటాం. రోడ్డు భద్రత విద్యలో భాగంగా పాఠ్యపుస్తకాల్లోనూ ఎడమవైపు వెళ్లాలనే చదువుకున్నాం. ఇక్కడ పుట్టి పెరిగిన వారంతా వాహనాలను ఎడమ వైపు నడుపుతారు. ఇండియాలో పుట్టి పెరిగిన కొందరు విదేశాల్లో కొన్నిరోజులు ఉండాల్సి వచ్చినప్పుడు డ్రైవింగ్ అనివార్యమవుతుంది. పైగా మనకు అక్కడి పరిస్థితులకు చాలా వ్యత్యాసం ఉంటుంది. అక్కడ రహదారులు 120, 150 కిమీల వేగానికి అనుగుణంగా రూపొందించి ఉంటాయి. అక్కడ డ్రైవింగ్ చేసే సమయంలో పొరపాటున ఎడమవైపు వెళ్లారో ఇక అంతే.. భారీ విషాదానికి మీరే బాధ్యులుగా మిగిలిపోతారు. ఇక రెండో రకం సమస్య ఏంటంటే.. ఇండియాలో పుట్టి పెరిగి విదేశాల్లో స్థిరపడ్డ వారిలో కొందరు సెలవులకు ఇండియాకు వచ్చిన సమయంలో పొరపాటున కుడి వైపునకు వాహనాలను జోరుగా దూకిస్తారు. ఫలితంగా జరగరాని అనర్థాలు క్షణాల్లో జరిగిపోతాయి. ఏ దేశానికి వెళ్లినా ముందుగా అక్కడ రోడ్డు నిబంధనల ప్రకారం సాధన చేయాలి. డ్రైవింగ్ వచ్చు కదా అని తొందరపడితే భారీ మూల్యం చెల్లించకతప్పదని ఆర్టీఏ అధికారులు హెచ్చరిస్తున్నారు.

అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ ఎందుకు?

విదేశాల్లో విద్య, ఉపాధి కోసం వలస వెళ్లే వారికి ఈరోజుల్లో అంతర్జాతీయ డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి. వీటిని దేశంలో ఎక్కడైనా తీసుకోవచ్చు. ఈ డ్రైవింగ్ లైసెన్స్‌ను చూపించి ప్రపంచంలో ఎక్కడైనా దాదాపు ఏడాదికాలం అక్కడి రోడ్డు నిబంధనల ప్రకారం డ్రైవింగ్ చేసుకునే వీలు కలుగుతుంది. అన్ని దేశాల్లో వెంటనే వాహనం తీసేందుకు అంగీకరించరు. కొందరు ముందుగా స్థానికంగా తమ రోడ్లపై నడపగలరు అని నిరూపించుకునేందుకు కొన్ని పరీక్షలు పాసవ్వాల్సి ఉంటుంది. ఆ తర్వాతే డ్రైవింగ్‌కు అనుమతిస్తారు. ఏడాదిపాటు వ్యాలిడిటీ ఉండే ఈ లైసెన్స్‌ను కాల పరిమితి ఆధారంగా రెన్యూవల్ చేసుకోవాల్సి ఉంటుంది. మరిన్ని వివరాలకు పరివాహన్.గవ్.ఇన్ (https://www. parivahan.gov.in) హెచ్‌టీటీపీఎస్: //డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.పీఏఆర్ఐవీఏహెచ్ఏఎన్.జీవోవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. లేదా ఆర్టీఏ కార్యాలయంలో పలు పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది.

దమ్ము, ధైర్యం ఉంటే చర్చకు రా..

- సమయం, స్థలం ఖరారు బాధ్యత మీదే
- జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసినా సరే..
- అభివృద్ధి పనులపై చర్చకు సిద్ధమా?
- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి మంత్రి కొప్పుల సవాల్

ధర్మపురి: బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులపై తరచూ ఆరోపణలు చేస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడిగా, మాజీ మంత్రిగా, ఎమ్మెల్సీగా ఉన్నత హోదాల్లో ఉండి ఇలా వ్యవహరించడం సమంజసమేనా? అని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. మీరు చేస్తున్న ఆరోపణలు సమంజసమనిపిస్తే.. అభివృద్ధి పనులపై చర్చకు సిద్ధమేనా? అని, అదికూడా జిల్లా కేంద్రంలోనే చర్చ జరగాలి అని ఈశ్వర్ సవాల్ విసిరారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం మంత్రి పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం, సీఎం కేసీఆర్, కాళేశ్వరం ప్రాజెక్టు, వ్యవసాయ రంగంపై అసత్యపు ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించడం మానుకోవాలని హితవు పలికారు. దమ్ము, ధైర్యం ఉంటే బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, కాళేశ్వరం ప్రాజెక్టు, రోళ్లవాగు పనులపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఎన్నికల్లో గెలుపు కోసం అసత్యపు ఆరోపణలు చేయడం మానుకోవాలని చెప్పారు.

ఇథనాల్ పరిశ్రమపై నిపుణుల అభిప్రాయాలు తీసుకుందాం..

వెల్గటూర్‌లో ఏర్పాటు చేస్తున్న ఇథనాయిల్ పరిశ్రమతో గోదావరి నదిలో జీవరాశులు, ప్రజల ప్రాణాలకు ముప్పు ఉంటుందని ప్రజల్లో భయాందోళనలు కలిగించేలా జీవన్‌రెడ్డి ఆరోపణలు చేయడం సరికాదని మంత్రి కొప్పుల అన్నారు. పరిశ్రమతో ప్రమాదం ఉంటుందా, లేదా? అనే విషయాలపై నిపుణుల సమక్షంలో తేల్చుకుందామని సవాల్ చేశారు. 40ఏళ్ల మీ రాజకీయ జీవితంలో తీపి గుర్తులుండాలే తప్ప విషంచిమ్మే జిమ్మిక్కులు మీ స్థాయికి తగదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ హయాంలో రోళ్లవాగు పరిస్థితి ఎలా ఉండేదో, ఇప్పుడు ఎలా ఉందో రైతులే చెబుతారన్నారు. రోళ్లవాగు ఆధునీకరణకు రూ.72 కోట్లు వెచ్చించి 15 వేల ఎకరాలకు సాగునీరు అందించామని తెలిపారు. ప్రాజెక్టు కింద ఉన్న గ్రామాలకు తాగునీరు అందుతోందని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో కోటి ఎకరాలకు సాగునీరు అందుతుండగా, పుట్ల ధాన్యం పండుతోందని, ఇది కనిపించడం లేదా అని జీవన్‌రెడ్డిని ప్రశ్నించారు. నిండుకుండలా ఉన్న చెరువుల వద్ద కోటిమంది వరకు పండుగలు జరుపుకోవడం జీర్ణించుకోలేకనే జీవన్‌రెడ్డి ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. నాటి కాంగ్రెస్ హయాంలో తుమ్మిడిహెట్టి వద్ద చేవెళ్ల, ప్రాణహిత పనులకు పర్యావరణ, అటవీ అనుమతులు లేకుండానే ప్రజాధనం దోచుకోవడం కోసం ప్రాజెక్టులు నిర్మించడం నిజం కాదా? అని నిలదీశారు. ఏది ఏమైనా ప్రాజెక్టుల నిర్మాణం, సంక్షేమ పథకాలు, వ్యవసాయ రంగం అభివృద్ధి తదితర అంశాలపై జగిత్యాల చౌరస్తాలో జీవన్‌రెడ్డితో చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని మంత్రి కొప్పుల స్పష్టం చేశారు. నీతి మాలిన కాంగ్రెస్ నాయకులు తీరు మార్చుకుని నిజాయితీగా రాజకీయం చేయాలని మంత్రి హితవు పలికారు. ఈకార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ఎంపీపీ, జెడ్పీటీసీలు చిట్టిబాబు, బత్తిని అరుణ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, వైస్ చైర్మన్ అక్కెనపెల్లి సునీల్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ రామన్న, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్



ఆకట్టుకుంటున్న పుష్పం

జగిత్యాలరూరల్: మోతె గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పిడుగు భాస్కర్‌రెడ్డి ఇంట్లో మే పుష్పం విరబూసింది. దీనిని చూసేందుకు గ్రామస్తులు ఆసక్తి చూపుతున్నారు.

మిల్లర్లదే పెత్తనం!

- వారి సూచనలతోనే ధాన్యంలో కోతలు
- క్వింటాలుపై 10 కిలోల వరకు కటింగ్‌లు
- భారమంతా సేకరణ కేంద్రాల నిర్వాహకులపైనే..
- కొనుగోళ్ల చివరిదశలో నష్టపోతున్న రైతులు

సాక్షి ఫొటో

సారంగాపూర్(జగిత్యాల): జిల్లాలో యాసంగి ధాన్యం కొనుగోళ్లు చివరి దశకు చేరుకున్నాయి. మరో రెండు, మూడ్రోజుల్లో కొనుగోలు కేంద్రాలు మూసివేసే అవకాశం ఉంది. ఈలోగా తమ ధాన్యం విక్రయించాలనే ఆత్రుత అన్నదాతల్లో క్రమంగా పెరుగుతోంది. దీనిని ఆసరాగా చేసుకున్న కొందరు సింగిల్‌విండోల నిర్వాహకులు.. క్వింటాలుపై అదనంగా 10కిలోల వరకు తూకం వేస్తున్నారు. తెరవెనుక రైస్‌మిల్లర్లు ఆదేశాలు జారీచేయడంతో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు అదనంగా తూకం వేయాల్సి వస్తోందని అంటున్నారు. ఎవరి వాటాలు ఎలా ఉన్నా.. చివరకు అన్నదాత తీవ్రంగా నష్టపోతున్నాడు. ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా సుమారు 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు.

చెల్లింపులు ఇలా..

జిల్లాలో ఇప్పటి వరకు ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో రూ.3.44 కోట్లు జమచేశారు. ఇంకా రూ.2.30 కోట్లు చెల్లించాల్సి ఉంది.

ఆదినుంచీ గందరగోళమే..

- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆదినుంచీ గందరగోళమే నెలకొంది.
- ప్రధానంగా కొనుగోళ్లలో మిల్లర్లదే పెత్తనమైంది. వారు చెప్పినట్లే కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ధాన్యంలో కోత పెట్టారు. ఇది రైతులకు తీవ్ర నష్టం చేకూర్చింది.
- కేంద్రాలు ప్రారంభించి రెండు నెలలు గడిచినా కొనుగోళ్లు ఇంకా పూర్తికాలేదు.
- గతంలో మండలానికో ప్రత్యేకాధికారిని నియమించి కొనుగోళ్లను పర్యవేక్షించేవారు. ఇప్పుడా పరిస్థితిలేదు.
- గతంలో ప్రభుత్వం అనుమతించిన కాంట్రాక్టర్ ద్వారా లారీల్లో ధాన్యం రైస్‌మిల్లులకు తరలించేవారు. తహసీల్దార్, ఆర్ఐ పర్యవేక్షించేవారు.
- ఈసారి కేవలం ఇద్దరు అధికారులను నియమించడంతో పర్యవేక్షణ కొరవడింది.
- మిల్లుకు చేరుకున్న లారీని వీఆర్ఏ గుర్తించి చేరుకున్న సమయం, అన్‌లోడ్ సమయం, ధాన్యం వివరాలను రాసి ఉన్నతాధికారులకు నివేదించేవారు. ఇప్పుడు అది మచ్చుకైనా కనిపించలేదు.



కొనుగోలు కేంద్రం నుంచి తరలిస్తున్న ధాన్యం

కొనుగోళ్ల తీరు(మెట్రిక్ టన్నుల్లో)

సంస్థ పేరు	కొనుగోలు కేంద్రాలు	సేకరించిన ధాన్యం
సింగిల్‌విండో	270	2,81,000
సెర్ప్(ఐకేపీ)	144	1,18,900

- ఇప్పుడు మిల్లర్లు తమ లారీల్లోనే ధాన్యం తరలించుకు వెళ్లారు.
- సింగిల్‌విండో, ఐకేపీల లారీలు కేంద్రాల్లో రోజుల తరబడి నిరీక్షిస్తున్నాయి.
- ఖాళీ గోనె సంచి బరువు నిబంధనల ప్రకారం 650 గ్రాములుగా పరిగణించాలి. కానీ, కొందరు రైస్‌మిల్లర్లు 700 గ్రాములు, మరికొందరు 700–800 గ్రాములు, ఇంకొందరు 900 గ్రాములుగా లెక్కలోకి తీసుకోవడంతో మిల్లుల వద్ద రైతులు తీవ్రంగా నష్టపోయారు.

పెరుగుతున్న తరుగు..

ధాన్యం త్వరగా తూకం వేయాలని రైతులు ఒత్తిడి చేయడంతో తొలుత కొన్ని రోజులు సాఫీగా సాగిన కొనుగోళ్లు.. ఆ తర్వాత నిర్వాహకులు సంచికి కిలోన్నర, రెండు కిలోలు, మూడు కిలోల చొప్పున తరుగు తీయడం ప్రారంభించారు. తప్ప, తాలులేని వడ్లు సంచికి 40.650 కిలోలు తూకం వేయాల్సి ఉండగా 42 కిలోలు తూకం వేశారు. లారీల్లో మిల్లులకు చేరుకోగానే అక్కడ పలు కారణాలు చూపుతూ బస్తాపూ మరో కిలో, రెండు కిలోలు కోత విధిస్తున్నారు.

అధికారుల పర్యవేక్షణ లోపం..

ధాన్యం కొనుగోలు కేంద్రాలపై అధికారుల పర్యవేక్షణ లేక తాత్కాలిక సిబ్బంది తూకంలో ఇష్టానుసారంగా వ్యవహరించారనే ఆరోపణలు వచ్చాయి. కొన్ని కేంద్రాల్లో క్వింటాలుపై 5 కిలోల నుంచి 8 కిలోల వరకు అదనంగా తూకం వేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సారంగాపూర్ మండలం గణేశ్‌పల్లిలో సంచికి అదనంగా మూడు, నాలుగు కిలోలు తూకం వేశారు. రైతులు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. వారు తూకం యంత్రాలను పరిశీలించడంతో మోసం వెలుగులోకి వచ్చింది. దీంతో ఇద్దరు తాత్కాలిక సిబ్బందిని విధుల్లోంచి తొలగించారు.

మిల్లర్లపై ఎన్ని ఆరోపణలు వచ్చినా..

జిల్లాలోని 69 రైస్‌మిల్లులకు ధాన్యం కేటాయించారు. కొందరు మిల్లర్లు ధాన్యం తూకంలో భారీ కోత విధిస్తున్నారని, కొనుగోలు కేంద్రాల్లో లారీతో సహా ధాన్యం తూకం వేసి, ట్రక్‌షీట్‌ను మిల్లరుకు పంపిస్తున్నారని రైతులు చెబుతున్నారు. అయితే, మిల్లరు పంపించే వేయింగ్ బిల్లు కొనుగోలు కేంద్రాలకు చేరేవరకు తూకంలో భారీ వ్యత్యాసం కనిపిస్తోందని అంటున్నారు.

ధాన్యంలో కోత పెట్టారు



నేను ఐకేపీ కేంద్రంలో 128(51క్వింటాళ్లు) సంచులు ధాన్యం అమ్మిన. ఆరు సంచులు అంటే 2.40క్వింటాళ్ల ధాన్యం కోత పెట్టిండ్రు. ఎంటీయూ 1010 రకం ఎ–గ్రేడ్ ధాన్యాన్ని మిల్లర్లు సాధారణ రకం వడ్లుగా తీసుకున్నరు. అందుకే నాకు రూ.10 వేల వరకు నష్టం జరిగింది.

– పెద్దిరెడ్డి స్వామిరెడ్డి, రైతు సారంగాపూర్

నష్టం నివారించాం



ధాన్యం కొనుగోళ్లలో రైతులకు నష్టం కలుగకుండా ప్రయత్నించాం. సమస్య తలెత్తినప్పుడల్లా రైస్‌మిల్లర్లతో మాట్లాడాం. అయితే, ఉన్నతాధికారులు పట్టించుకోలేదు. దీంతోనే కొనుగోళ్లలో జాప్యం జరుగుతోంది. మిల్లర్లు పెత్తనం చేయడానికి అవకాశం ఏర్పడింది.

– అయ్యోరి తిరుపతి, సీఈవో, సింగిల్‌విండో, బీర్‌పూర్

సిబ్బందిపై చర్యలు



రైతులకు నష్టం జరగకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను తరచూ సందర్శించాం. రైస్‌మిల్లుల వద్దకు వెళ్లి లోపాలు సరిదిద్దాం. అయినా, కొనుగోలు కేంద్రాల్లోని తాత్కాలిక సిబ్బంది నష్టం చేస్తే వారిని విధుల్లోంచి తొలగిస్తాం. కొత్తవారిని నియమిస్తాం.

– ఏలేటి నర్సింహారెడ్డి, చైర్మన్, సింగిల్‌విండో, సారంగాపూర్

క్లుప్తంగా

నృసింహుని ఆదాయం రూ.3.64లక్షలు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామికి వివిధ మార్గాల ద్వారా రూ.3,64,572 ఆదాయం సమకూరినట్లు దేవస్థానం ఈవో శ్రీనివాస్ తెలిపారు. టికెట్ల ద్వారా రూ. 1,89, 584, ప్రసాదాల ద్వారా రూ. 1,24,700, అన్నదానం కోసం విరాళాలు రూ.50,288 ఆదాయం సమకూరినట్లు ఆయన వివరించారు.

విదేశాల్లో ఉద్యోగావకాశాలు

జగిత్యాల: ఆసక్తి, అర్హులైన వారికి విదేశాల్లో ఉద్యోగావకాశాలు ఉన్నాయని ఎంప్లాయిమెంట్ అధికారి సత్తమ్మ శనివారం తెలిపారు. ఇందుకోసం తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ ఆధ్వర్యంలో ఈనెల 14న అవగాహన కల్పిస్తామని, అభ్యర్థుల వివరాలు నమోదు చేస్తామన్నారు. నర్సులు, ఆరోగ్య సంరక్షణ తదితర విభాగాల్లో ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. యూఎస్‌ఏ, కెనడా, జపాన్, ఆస్ట్రేలియా, యూకే, జర్మనీ దేశాల్లో ఈ పోస్టులకు డిమాండ్ ఉందని వివరించారు. ఆసక్తిగలవారు తమ బయోడేటాతో పాటు సంబంధిత డాక్యుమెంట్లతో స్థానిక ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో నేరుగా హాజరు కావాలని సూచించారు. వివరాల కోసం www.otm-c-om.tea nfa na.gov.in సందర్శించాలని, లేదా 96022 92450 నంబరులో సంప్రదించాలని కోరారు.

'సర్పంచ్ సంవాద్'కు ఆహ్వానం

మెట్‌పల్లి(కోరుట్ల): ఢిల్లీలో ఈనెల 13న క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సంస్థ నిర్వహించే 'సర్పంచ్ సంవాద్' కార్యక్రమానికి ఆత్మనగర్ సర్పంచ్ జరుపుల శ్రీనివాస్‌కు ఆహ్వానం అందింది. పంచాయతీలో పాలన, ఎదురయ్యే సమస్యలపై శ్రీనివాస్ ఈ సదస్సులో మాట్లాడతారని అధికారులు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడితే కఠిన చర్యలు

సిరిసిల్లక్రైం: మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామని సిరిసిల్ల టౌన్ సీఐ అనిల్‌కుమార్ హెచ్చరించారు. గత రెండు నెలల్లో నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్ టెస్టులో పట్టుబడిన 120 మందిని లోక్ అదాలత్‌లో భాగంగా కోర్టులో హాజరుపరిచినట్లు శనివారం తెలిపారు. అనంతరం సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ట్రాఫిక్ ఎస్సై రాజు, కానిస్టేబుల్ స్వామి పాల్గొన్నారు.

కాపర్ దొంగల అరెస్టు

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్‌లో రెండు నెలల క్రితం బోరుబావుల వద్ద కరెంట్ తీగలను చోరీ చేసిన ఘటనలో ఇద్దరు దొంగలను శనివారం అరెస్టు చేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. ఇరవై మంది రైతుల బోరు మోటార్ల నుంచి కాపర్ కోసం వరుస చోరీలకు పాల్పడ్డారన్నారు. ఈ క్రమంలో విచారణ చేపట్టగా.. ముస్తాబాద్‌లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా అసలు విషయం తెలిసిందన్నారు. ఇద్దరు దొంగలది తంగళ్లపల్లి మండలం చింతల్‌ఠాణాకు చెందిన సూర రాజు, సూర పోచయ్యలుగా గుర్తించినట్లు తెలిపారు. నిందితులను నుంచి 10 కిలోల రాగి, ఒక బోరు మోటారును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. దొంగలను పట్టుకున్న పీసీలు రాజశేఖర్, ఖాసీంలను ఎస్సై అభినందించారు.

విద్యార్థుల ఆరోగ్యమే లక్ష్యం

- చిన్నారులకు పౌష్టికాహారం
- మూడు రోజులు కోడిగుడ్లు, వెజ్ బిర్యానీ
- 65,632 మంది విద్యార్థులకు ప్రయోజనం
- జిల్లాలో ఈనెల 12 నుంచి అమలుకు చర్యలు


మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు(ఫైల్)

రాయికల్(జగిత్యాల): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని మరింత పోషక విలువలతో అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. దీనిని ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు చేయాలని ఆదేశించింది. వారంలో ఒకరోజు కిచిడీ, వెజ్ బిర్యానీ తప్పనిసరి చేసింది. రోజూ మిక్స్‌డ్ వెజిటబుల్ కర్రీ అందించేందుకు చర్యలు తీసుకుంది. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే సోమవారం నుంచి కొత్త మెనూ అమలు చేయాలని పాఠశాల విద్యాశాఖ ఇటీవల డీఈవోలకు ఆదేశాలు జారీచేసింది. ప్రస్తుతం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (ఒకటి నుంచి ఐదో తరగతి)లో పిల్లలకు అన్నం వండి పెట్టి నందుకు రోజూ ఒక్కో విద్యార్థికి రూ.5.45, ఉన్నత పాఠశాల (ఆరు నుంచి పదో తరగతి) విద్యార్థులకు రూ.8.17 చొప్పున కూరగాయలు, ఇతరత్రా ఖర్చులకు ప్రభుత్వం చెల్లిస్తూ వస్తోంది.

జిల్లాలో 65,632 మంది విద్యార్థులు..

- జిల్లాలో మొత్తం ప్రభుత్వ పాఠశాలలు 783 ఉండగా వాటిలో 65,632 మంది వరకు విద్యార్థులు చదువుతున్నారు.
- మధ్యాహ్న భోజనంలో కొత్త మెనూ అమలుతో వారంలో మూడు రోజులు విద్యార్థులకు పౌష్టికాహారం అందనుంది.
- పోషక విలువలతో కూడిన ఆహారం అందడం ద్వారా పిల్లల ఆరోగ్యం, శారీరక ఎదుగుదలకు దోహద పడుతుందని అధికారులు భావిస్తున్నారు.
- ప్రభుత్వం కొత్త మెనూను నిర్దేశించటం బాగుందని, దీన్ని పకడ్బందీగా అమలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

జిల్లా సమాచారం	
ప్రాథమిక పాఠశాలలు	511
ప్రాథమికోన్నత పాఠశాలు	85
ఉన్నత పాఠశాలలు	187

మధ్యాహ్న భోజనం ఇలా..

సోమవారం : కిచిడీ + మిశ్రమ కూరగాయల కూర, కోడిగుడ్డు
మంగళ : అన్నం + సాంబారు + మిశ్రమ కూరగాయల కూర
బుధ: అన్నం, కూర, పప్పు + మిశ్రమ కూరగాయల కూర+కోడిగుడ్డు+మిశ్రమ కూరగాయల కూర
శుక్ర : అన్నం + సాంబారు + మిశ్రమ కూరగాయల కూర + కోడిగుడ్డు
శనివారం : అన్నం + ఆకుకూర పప్పు + మిశ్రమ కూరగాయల కూర.

ఈ విద్యా సంవత్సరం నుంచి అమలు చేస్తాం



జిల్లాలో ఈనెల 12న పాఠశాలలు పునః ప్రారంభమవుతాయి. ప్రభుత్వం మధ్యాహ్న భోజనంలో ప్రవేశపెట్టిన నూతన మెనూ ఆరోజు నుంచి పకడ్బందీగా అమలు చేస్తాం. ఇందుకోసం అన్ని చర్యలు చేపట్టాం. మధ్యాహ్న భోజన నిర్వాహకులకు ఇప్పటికే ఆదేశాలు జారీచేశాం.
– జగన్మోహన్‌రెడ్డి, డీఈవో

అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీకి ఏర్పాట్లు

- రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు
- 3,587 మంది విద్యార్థులు.. 21 పరీక్ష కేంద్రాలు
- ఒక్క నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ


విద్యార్థులకు హాల్‌టికెట్లు అందిస్తున్న ప్రిన్సిపాల్

కథలాపూర్(వేములవాడ): జిల్లాలో ఈనెల 12 నుంచి 19వ తేదీ వరకు ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకోసం తగిన ఏర్పాట్లు పూర్తిచేసినట్లు జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి నారాయణ తెలిపారు. ఫస్టియర్ విద్యార్థులకు ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు, సెకండియర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు.

21 పరీక్ష కేంద్రాలు.. 3,587 మంది విద్యార్థులు

- జిల్లాలో ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల కోసం 21 పరీక్ష కేంద్రాలు కేటాయించారు.
- జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు 71 ఉన్నాయి.
- ఇవీ పరీక్ష కేంద్రాలు : 13 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, వెల్గటూర్ మోడల్ స్కూల్, జగిత్యాలలో నాలుగు ప్రైవేట్ జూనిర్ కళాశాలలు, కోరుట్లలో ఒక ప్రైవేట్ జూనియర్ కళాశాల, మెట్‌పల్లిలో రెండు ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.
- ప్రథమ సంవత్సరంలో ఫెయిలైనవారితోపాటు మార్కుల ఇంప్రూవ్‌మెంట్ కోసం ఫీజు చెల్లించిన 2,433 మంది విద్యార్థులు హాజరవుతారు. సెకండియర్‌లో ఫెయిలై పరీక్ష ఫీజు చెల్లించిన వారు 1,154 మాత్రమే హాజరవుతారని అధికారులు తెలిపారు.
- విద్యార్థులకు సౌకర్యంగా ఉండాలని పరీక్ష కేంద్రాల్లో డెస్కులు, బెంచీలు, ఫ్యాన్లు, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశారు.

నిమిషం ఆలస్యమైతే అనుమతి లేదు

- విద్యార్థులు గంటముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. నిమిషం ఆలస్యమైతే పరీక్షకు అనుమతించరు. విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి ఉదయం 8.15 గంటల నుంచి అనుమతి ఇస్తామని, మధ్యాహ్నం 2 గంటల నుంచి అనుమతి ఇస్తామని అధికారులు తెలిపారు. ప్రతీ పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. నిమిషం ఆలస్యమైతే పరీక్షకేంద్రంలోకి అనుమతి ఉండదని విద్యార్థులకు తెలియజేసి అవగాహన కల్పించామని విద్యాశాఖ అధికారులు వివరించారు.

రాజీ మార్గమే ఉత్తమం


మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ అరుణ్‌కుమార్

మెట్‌పల్లి(కోరుట్ల): లోక్ అదాలత్‌లో కేసులు సత్వరం పరిష్కారమవుతాయని మెజిస్ట్రేట్ అరుణ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. పలు కేసుల్లో కక్షిదారులు రాజీ కుదుర్చుకోవడంతో వాటిని మెజిస్ట్రేట్ పరిష్కరించారు. అంతకు ముందు మెజిస్ట్రేట్ మాట్లాడుతూ కేసులతో కక్షిదారులు అనేకవిధాలుగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. రాజీ కుదుర్చుకుంటే ఊరట కలుగుతుందని తెలిపారు. పంతాలకు పోకుండా లోక్ అదాలత్‌లో సమస్యలు పరిష్కరించుకోవడానికి ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి, న్యాయవాదులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


అభినందిస్తున్న గౌతమకృష్ణారావు, బీరయ్య

మల్యాల(చొప్పదండి): తాటిపల్లి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి వివేక్ జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో రాణించి రజత పతకం సాధించాడు. తాటిపల్లికి చెందిన కొత్తపల్లి వివేక్.. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. పీఈటీ బీరయ్య ఆధ్వర్యంలో రెండేళ్లుగా ఆడుతూ రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి, ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు అనంతపూర్‌లో జరిగిన 13వ మినీ సబ్ జూనియర్ జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో తెలంగాణ రాష్ట్రం తరఫున పోటీల్లో పాల్గొన్నాడు. అండర్ –13లో తెలంగాణ టీం రజత పతకం సాధించాడు. ప్రధానోపాధ్యాయుడు కండ్లె గౌతమకృష్ణారావు, పీఈటీ ఈరు బీరయ్య తదితరులు విద్యార్థి వివేక్‌ను అభినందించారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు


మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్


హాజరైన అధికారులు

- మంత్రి కొప్పుల ఈశ్వర్

జగిత్యాల: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం కేసీఆర్ సుపరిపాలన అందిస్తున్నారని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కలెక్టరేట్‌లో శనివారం సుపరిపాలన దినోత్సవం నిర్వహించారు. మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ తదితర అన్ని వర్గాలు సంక్షేమ పథకాల ఫలాలు పొంది సంతోషంగా ఉన్నాయన్నారు. సుస్థిర పాలన, శాంతిభద్రతల పరిరక్షణతోనే రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నారని తెలిపారు. ఏ ఆశయ సాధన కోసం తెలంగాణ సాధించుకున్నామో ఆ లక్ష్య సాధన దిశగా అడుగులు పడుతున్నాయని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద కాళేశ్వరం ప్రాజెక్టుతో తెలంగాణ సస్యశ్యామలంగా మారిందని అన్నారు. హైదరాబాద్‌ను ఐటీ హబ్‌గా మార్చేందుకు సర్కారు చూస్తోందన్నారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత, కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎస్పీ భాస్కర్, అదనపు కలెక్టర్లు లత, మకరంద్, డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

చీఫ్ ఇంజినీర్ కార్యాలయం ప్రారంభం

జిల్లా కేంద్రంలోని రోడ్లు భవనాల శాఖ చీఫ్ ఇంజినీర్ కార్యాలయాన్ని మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రారంభించారు.

సంక్షేమ పథకాలు అందించాలి


మాట్లాడుతున్న నాయకులు

మల్లాపూర్(కోరుట్ల): నిరుపేద విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్కాకుల సద్గురు కోరారు. గుండంపల్లిలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుత విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షురాలిగా సంకోజి మణెమ్మ(గుండంపల్లి)కు నియామక పత్రాన్ని అందించారు. అనంతరం ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.100కోట్ల బడ్జెట్ కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు సంకోజి రాజేందర్, ధర్మారం శ్యామల, కనపర్తి నాగరాణి, సంకోజి లహరిక, మండలోజి నాగరాణి, తుమ్మనపల్లి సుజాత, శ్రీదేవి, పద్మ, అంజమ్మ, తేజశ్విని తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

జగిత్యాలక్రైం: స్థానిక ఓ కాలనీకి చెందిన యువతి (20) అదృశ్యమైనట్లు ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. సదరు యువతి ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతోంది. శుక్రవారం ప్రాక్టికల్ పరీక్ష ఉందని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. యువతి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రాంచందర్‌రావు తెలిపారు.

టెన్త్ ఫలితాలపై అంతర్మథనం

- 32మంది విద్యార్థులకు 8మందే ఉత్తీర్ణత
- తగ్గిన ఫలితాలపై తల్లిదండ్రుల ఆందోళన
- ఉపాధ్యాయుల మధ్య సమన్వయ లోపమే కారణం?



సారంగాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల

సారంగాపూర్(జగిత్యాల): సారంగాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొన్నటి పదవ తరగతి ఫలితాలు తగ్గడం కొత్తగా చేరే విద్యార్థులపై ప్రభావం చూపినట్లు తెలుస్తుంది. సారంగాపూర్ మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉండగా, మండలంలోని అర్పపల్లి, రేచపల్లి, కోనాపూర్, రంగపేట గ్రామాల్లో జిల్లా పరిషత్ పాఠశాలలతో పాటు, కస్తూరిభా బాలికల విద్యాలయంలో విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసిస్తున్నారు. సారంగాపూర్ ప్రభుత్వ పాఠశాలకు అనుబంధంగా ప్రభుత్వం సాంఘీక సంక్షేమ వసతి గృహాన్ని కూడ నిర్వహిస్తుంది. హాస్టల్ వసతి ఉండడంతో పాఠశాలలో చేరడానికి ఎక్కువ మంది విద్యార్థులు సారంగాపూర్ ఉన్నత పాఠశాలలో చేరడానికి శ్రద్ధ ఉన్నా, తగ్గిన పదవ తరగతి ఫలితాలు కొత్తవారి చేరికపై ప్రభావం చూపుతున్నాయి.

గతమెంతో ఘనం..

- స్థానిక ప్రభుత్వ పాఠశాల పదో తరగతిలో గత మూడేళ్లలో మంచి ఫలితాలు సాధించింది.
- 2020లో 100 శాతం ఉత్తీర్ణత నమోదు చేసింది.
- 2021లో కూడా 100 శాతం ఉత్తీర్ణత సాధించి విద్యాశాఖ అధికారుల నుంచి ప్రశంసలు అందుకుంది.
- కానీ, 2022లో 96శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.
- 2023లో కేవలం 25శాతం ఉత్తీర్ణత నమోదు చేయడం తల్లిదండ్రులతోపాటు అధికారులనూ విస్మయానికి గురిచేసింది.
- మొత్తం 32 మంది విద్యార్థులు వార్షిక పరీక్షలకు హాజరైతే.. అందులో కేవలం 8 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించడంపై అధికారులు సమీక్షిస్తున్నారు.

ఫలితాలపై గైర్హాజరు ప్రభావం..

దాదాపు 10 మంది విద్యార్థులు పాఠశాలకు గైర్హాజరయ్యారు. ఉపాధ్యాయులు వారి ఇళ్లకు పదేపదే వెళ్లి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. చదువుకోవడం ద్వారా పిల్లల భవిష్యత్ ఎలా ఉంటుందనే అంశంపై అవగాహన కల్పించారు. దీంతో రెండ్రోజులపాటు పిల్లలు బడికి వచ్చారు. ఆ తర్వాత మానేశారు. వార్షిక పరీక్షలకు హాజరైనా ఉత్తీర్ణులు కాలేదు. కొందరు విద్యార్థులు ట్రాక్టర్లు, వ్యవసాయ కూలీలుగా పనులకు వెళ్లారు. తల్లితండ్రులు వారిని వారించలేదు. ప్రతినెలా మూడో శనివారం తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించిన ఒకరిద్దరు తప్ప పెద్దగా ఎవరూ హాజరు కాలేదు. దీంతో పదిమంది విద్యార్థులు ఫెయిల్ కావడం మొత్తం ఫలితాలపై ప్రభావం చూపిందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. మరోవైపు.. ఉపాధ్యాయుల మధ్య సమన్వయ లోపం కూడా ఫలితాలు తగ్గడానికి ఓ కారణమని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. అయితే, ఈసారి ప్రశ్నపత్రాలు కఠినంగా వచ్చాయని, అందుకే జవాబులు సరిగా రాయలేకపోతున్నామని విద్యార్థులు చెబుతున్నారు.

సమీక్షిస్తున్నాం



పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఫలితాలు తగ్గడంలో లోపాలపై సమీక్షిస్తున్నాం. విద్యార్థులు పాఠశాలకు రాకుంటే వెంటనే గుర్తించేలా ఉపాధ్యాయులకు సూచనలు ఇచ్చాం. కొత్త విద్యా సంవత్సరంలో ఇలాంటి సమస్యలను అధిగమిస్తూ మళ్లీ 100 శాతం ఉత్తీర్ణత సాధిస్తాం.
– వేణుగోపాల్, హెచ్‌ఎం

ఫలితాలు మెరుగు పరుస్తాం



సారంగాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొన్నటి పదో తరగతి పరీక్షల్లో ఫలితాలు తగ్గాయి. ఈ విద్యా సంవత్సరంలో మెరుగైన ఫలితాలు సాధించడానికి ఇప్పటి నుంచి ఉపాధ్యాయులు, విద్యార్థులను సన్నద్ధం చేసేలా ప్రణాళిక రూపొందించాం.
– భీమయ్య, ఎంఈవో

ధర్మపురిలో కత్తిపోట్లు

- ఇద్దరు యువకులకు గాయాలు



కత్తిపోట్లకు గురైన నిరంజన్, వినయ్

ధర్మపురి: పట్టణంలోని సంతలో శనివారం జరిగిన గొడవల్లో ఇద్దరు యువకులు కత్తిపోట్లకు గురయ్యారు. స్థానికుల కథనం ప్రకారం .. స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన యువకులు, గిరుకలకాలనీకి చెందిన యువకులకు నెల క్రితం గొడవలు జరిగాయి. ధర్మపురిలో శనివారం జరిగే సంతలో ఎస్సీ కాలనీకి చెందిన ముప్పట్ల నిరంజన్, బత్తిని వినయ్ చిట్టీ వసూలు చేస్తున్నారు. పాత కక్షలను దృష్టిలో పెట్టుకున్న గిరుకలకాలనీకి చెందిన కొందరు యువకులు సంతలోకి వెళ్లారు. చిట్టీ డబ్బులు వసూలు చేస్తున్న ఇద్దరు యువకులతో గొడవపడ్డారు. ఈక్రమంలో కత్తితో దాడి చేయగా మెడపై, చేతులకు గాయాలయ్యాయి. గాయాలైన వారిలో ముప్పట్ల నిరంజన్, బత్తిని వినయ్ ఉన్నారు. బాధితులు వెంటనే పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. పోలీసులు వారిని జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. గిరుకల కాలనీకి చెందిన వారు దాడికి పాల్పడిన వారని, వారు ఆంధ్రా హోటల్లో పనిచేసేవారని స్థానికులు తెలిపారు. ఇప్పటిరకు కేసు నమోదు కాలేదని ఏఎస్సై రాజు తెలిపారు.

బెదిరించిన వ్యక్తులపై కేసు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని గణేశ్‌నగర్ ప్రాంతానికి చెందిన కైరి భూమాగౌడ్ భూమిలో అక్రమంగా షెడ్డు నిర్మిస్తుండగా వారిని అడ్డుకుని, బెదిరించిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు శనివారం తెలిపారు. కైరి భూమాగౌడ్ బైపాస్‌రోడ్డులోని సర్వేనంబరు 514లో రెండు గుంటలు కొనుగోలు చేశాడు. అదే భూమిలో శనివారం సిరికొండ లక్ష్మణ్‌తోపాటు, మరికొందరు అక్రమంగా ప్రవేశించి షెడ్డు నిర్మాణం చేపట్టారు. భూమాగౌడ్ అక్కడకు వెళ్లడంతో చంపుతామని వారు బెదిరించారు. ఈమేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రాంచందర్‌రావు తెలిపారు.

చందాలతో అంత్యక్రియలు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని ఇందిరమ్మకాలనీకి చెందిన అంకం బాలరాజు(60) అనారోగ్యంతో శనివారం కన్నుమూశాడు. నిరుపేద కుటుంబం కావడంతో దహన సంస్కారాలకూ డబ్బులు లేకపోవడంతో కన్నీరుమున్నీరయ్యారు. విషయం తెలుసుకున్న దాతలు ఆర్థికసాయం చేయడంతో అంతిమయాత్ర నిర్వహించారు.